# సంపాదన

రాజవరపు పార్థసారథి

కిటికీ చువ్వలలోంచి చొచ్చుకొని, వచ్చిన సూర్యకిరణాలు సూదుల్లా కంటి రెప్పలపై పడటంతో - బుచ్చి రామయ్యకు గబుక్కున మెలకువ వచ్చింది. ఇంత ఎండ వచ్చేవరకూ ఎప్పుడూ పడుకొని వుండలేదు. ఇంటిగోడలూ, వస్తువులూ అన్నీ చైతన్య రహితంగా కనిపించసాగాయి. ఒక్క మొగం వేసుకొన్నట్లు - విచారంగా వున్నాయి. మనస్సులో ఒకవిధమైన - ఆందోళనా, భయమూ మొదలుగాగల అనుభూతులు బయలుదేరాయి. గుండె త్వరగా కొట్టుకోవడం మొదలెట్టింది. భవిష్యత్తు శూన్యంగానూ, అర్థరహితంగానూ కన్పించసాగింది. ఆ రోజువరకూ ఓ విధమైన కార్యక్రమమూ విదోవిసంగా బండి నీడ్వగలననే ధీమా ఉండేది. తనకిష్టం లేకపోయినా — ప్రభుత్వంమాత్రం "నువ్వు చాలాకష్టపడావు గనుక - హాయిగా విశ్రాంతి తీసుకోరా బాబూ" అంది. తలచుకొంటే — తన సర్వీసు ఇంకా అయిదు సంవత్సరాలు పొడిగించవచ్చు. కాని కమీషనరుగారి అభ్యర్థికొకడికి - నిరుద్యోగంనించి విముక్తికల్పిద్దామనే సదుద్దేశంతోనూ — ఛయిర్మన్ గారి తొలాకు - రామన్న చౌదరిని తన పదవిలోకి ప్రమోషన్ చేద్దామనీ - ఒకేదెబ్బకు రెండు పిట్టలు అనే సామెతగా - తన సర్వీసు ఇంక అవసరము లేదు గనుక "యింకా శ్రమ ఎందుకు? హాయిగా విశ్రాంతి తీసుకోక?" అని హితం పలికారు. నిజానికి తనకీ విశ్రాంతి తీసుకుందామనే వుంది. కాని గడిచేదెల్లాగ? తను చేసిన పాతిక సంవత్సరాలసేవకు - తనకు మిగిలింది, అయిదువేల ఆరువందల రూపాయిలు ప్రావిడెంటు ఫండు మాత్రమే. కాని ఈ డబ్బు ఎందుకు సరిపోతుంది?

దుప్పటి కొంచెం పైకి లాగుకొని - ఎడం వైపుకి వత్తిగిలాడు.

"ఏమండీ? ఇంకా మీకు తెల్లారలేదా? అప్పుడే వర్సన్న ఒకసారి వచ్చి మళ్ళా సాయంత్రం కనబడతానని వెళ్లాడు. పెద్దమ్మాయి ఈ వేళ మెయిల్లో వస్తోంది కదా? పెందరాళే వెళ్లి ట్రెజరీలో డబ్బు మార్చి మెయిలుకెళ్లి అమ్మాయిని తీసుకురండి. రేపటినించి - హాయిగా కావలసినంత సేపు నిద్రపోవచ్చు". గుక్క తిప్పకుండా అనేసి, సగానికి కట్టబడిన బక్కెట్టు బొమ్మ గల తెరను తొలగించుకొని వెళ్ళిపోయింది భార్య కాసులమ్మ.

బుచ్చిరామయ్యను భయం పూర్తిగా ఆవహించింది. ఇవన్నీ తన దరిద్రానికి హేతువు లనుకున్నాడు. ఇంతవరకూ గౌరవంగా బ్రతుకుతూ వచ్చాడు. రేపు ఎల్లాగ? ఏదో జ్ఞాపకం వచ్చినట్లు గభాల్ని లేచి డ్రాయరుసొరుగు తీశాడు. అయిదు వేల రూపాయల చెక్కు తనకి మిగిలింది—అదే ఆ గదిలోంచి డబ్బు తీసుకుపోవడానికి అప్పుడే బాకీదార్లు - నక్కల్లా కాచుకు కూర్చున్నారు. దానిప్రక్కనే నీలం కవరు. అది తన అల్లుడి దగ్గరనించి వచ్చింది. ఓసారి తీసి మళ్ళా చదివాడు.

"మహారాజశ్రీ బుచ్చిరామయ్యగారికి - తను అల్లుడు నమస్కరించి వ్రాయునది—

ఉభయకుశలోపరి. ఈ మధ్య ఈ ఊళ్లో ఉన్న సినిమాహాలు ప్రొప్రయిటరుకీ, నాకూ కొంచెం తగాదావచ్చింది. దాంతో నేను లంచం పుచ్చుకొన్నట్లు పిటీషను వెళ్ళడం- ఎంక్వయిరీ అవటంకూడా జరిగింది. అది నిరూపణకానట్లు వ్రాయించుకోవాలంటే- ఎంక్వయిరీ ఆఫీసరుకు ఓ పచ్చ కాగితం సమర్పించుకోవాలి - లేకపోతే - పుచ్చుకోకపోయినా లంచం పుచ్చుకున్నట్లు నిరూపణ అవ్వడం - నా ఉద్యోగం ఊడటం అనుమానం లేకుండా జరుగుతాయి. మీరు రిటైర్ అయినట్లు తెలిసింది. సంతోషం. గనుక మీకు ఈ ఉత్తరం అందినవెంటనే ఒకవంద రూపాయలు పంపవలెను. మీ పెద్దమ్మాయిని పురిటికి పంపుతున్నాను. పదోతారీఖు మెయిలుకువచ్చి రిసీవ్ చేసుకోవలెను. డబ్బు తప్పక పంపవలెను. ఇంతే సంగతులు." ఉత్తరం కవర్లో పెట్టేశాడు - వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు.

పిల్లలంతా దొంగల్లాగ కనబడ్డారు. తనజీవితమంతా ధారపోసి శరీరాన్ని పిల్చి, పిప్పిచేసి - సంపాదించిన అయిదు వేల ఆరువందల రూపాయిలూ - త్రుప్పకు పోవడానికి కూర్చున్నారు. హుఁ - ఈ బాకీలు అవీ తీర్చేసే హాళ్ళికి - హాళ్ళి - సున్నకి. సున్న.

పెద్దపిల్ల పెళ్ళికి - ఉన్న ముందువాలోగిలి కాస్తా తనఖాపెట్టి కంట్రాక్టరు వర్సన్న దగ్గర - రెండు వేలు అప్పుతీసుకొని- ఏదో! "అయింది." అనిపించాడు. దానితో కొంతభారం తగ్గింది అనుకున్నాడు. కాని ఇంతలోనే - అల్లుడు కాస్తా ఉద్యోగం వదులుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని కలగన్నాడా? సంపాదన లేకపోయినా సంతానానికి లోటు ఉండకూడదు కాబోలు - అప్పుడే పెద్దమ్మాయి పురిటికి సిద్ధం. ఇంకా పెళ్ళికి చేసిన అప్పు తీర్చనే లేదు. విడవలేకపోయాడు! ఆత్మగౌరవమటకి? - అయినా పెద్ద వాళ్ళతోటి డబ్బున్న వాళ్ళతోటి పేచీలూ, పట్టింపులూ ఏమిటి? ఓ నమస్కార బాణం వదిలేస్తుంటే - అన్నీ సద్దుకుపోతాయి. తను ఎన్నివిధాలా మారాడు తన సర్వీసులో - ఎంతమంది ఆఫీసర్లని డబ్బున్న వాళ్ళని చూశాడు? - అయినా ఈ దరిద్రగ్రహాన్ని మించిన గ్రహం లేదు. మిగతా గ్రహాలు - ఏదో అభిషేకంతో శాంతిస్తాయి - ఈ గ్రహానికి కనకాభిషేకం చేసినా తృప్తికలగదు.

పోనీ తను ఖర్చుపెట్టిన డబ్బు - తన కొడుకు గోపాలం ద్వారా భర్తీ చేద్దామనుకుంటే - వీడు ఎందుకూ పనికిరాని అప్రయోజకుడుగా తయారయ్యాడు. ఇరవైరెండో ఏడు దాటుతున్నా ఇంకా వష మెయ్యలేదు. సంసార బాధ్యత తెలియదు. ఉద్యోగాన్వేషణా చెయ్యలేదు. పోనీ ఈ మున్సిపాలిటీలో నేనా ఇప్పిద్దామంటే - అదిగో డిగ్రీ ఒకటి ఏడిసిందిగా? లోకల్ బోర్డు సర్వీసు, ముఖ్యంగా గుమస్తాగిరీ చెయ్యనంటాడు. చేసినవాళ్ల చరిత్రలు చెప్పి - వాళ్లేం సుఖపడుతున్నారు? అని అడుగుతాడు. పోనీ మంచిది దొరికేదాకా నేనా చెయ్యవు గాని అని ఒప్పించి తీసుకొస్తే- ఆరోజున పెద్ద సంభాషణ.

"ఏమండీ! గోపాలంగారూ ఇల్లాగ దయచేశారు?" వ్యంగ్యంగా అన్నాడు ఛయిర్మన్.

"ఏదేనా, గుమస్తాగిరీకోసం."

"మీరూ - ఈ చక్రంలో పడిపోతే ఎల్లాగ? మన దేశం ఎక్కువగా గుమాస్తాలను తయారుచేసి పారేస్తోంది. ఏవో వృత్తులు వారు నిర్వహిస్తేనిరుద్యోగం-మాపు లేకుండా పోతుంది!" ఇదివరలో - సభలో మాట్లాడిన గోపాలం మాటలు తిరిగి జ్ఞప్తికి తెచ్చాడు. "తమరు ఏదేనా వృత్తిని చూసుకోవచ్చు.

# సంపాదన

ఎవరికేనా సభల్లో- వికేటప్పుడు, స్థితి తెలుసుకు మాట్లాడుతూ ఉండాలి ?"

ఇదీ ఆరోజు జరిగిన సంభాషణ-వెనకటి పెద్దపెద్ద విషయాలెందుకు. దేశం ఏమయితే వీళ్ళకెందుకు? చెయిర్మన్‌ని బహిరంగం చెయ్యడం ఎందుకు? మేనేజరుకొడుకు కావడంవల్ల లోగుట్లు తెలిశాయిగాని-ప్రజలకేమన్నా తెలుసా? ఎందుకొచ్చిన బి.ఏ? డబ్బా తగలేశాడు. కృష్ణమూర్తిగారబ్బాయి ఓవర్సీరుకోర్సు ప్యాసయ్యాడు— రెండు చేతులతోనూ సంపాదిస్తున్నాడు. ఉద్యోగంలో చేరి ఆరునెలలయిందో లేదో? అప్పుడే ర్యాలీసైకిలూ, ఒమేగా రిస్టువాచీ కొనుక్కున్నాడు. సలక్షణంగా పెళ్ళి చేసుకొని పెళ్ళానికి మామిడిపిందెల నెక్లెసు కూడా చేయించాడు. వీడూ ఉన్నాడు? అస్తమానూ ఏదో పుస్తకం పట్టుకోడం, కూర్చోడమూ! అదిగో ఆ నిరుద్యోగాశ్రమం, లైబ్రరీ ఉండనేవుంది. అదే వీడి నిలయం. ఆ పుస్తకాలు కూడూ గుడ్డా పెడతాయా?- బాగా వెనకాల జమీలుపడి ఏడుస్తూ ఉంటే- చెయ్యాలిసిన పనులివి.

ఇంతలోకే- కొంప మునిగిపోయినట్లు "నామాట ఏంచెప్పేవ్ నాన్నా?" అంటూ రెండోపిల్ల శ్యామల పెద్దమనిషిఅయి పెళ్ళికి సిద్ధంగా కూర్చుంది.

నర్సన్న బాకీ వడ్డీతోసహా రెండువేల ఆరువందలూ తీర్చేస్తే మిగిలింది మూడువేలు. ఇందులో అవీ, ఇవీ చిల్లరబాకీలు వెయ్యి. మిగిలిన రెండువేలలో రెండోపిల్లను పంపిస్తే మిగిలింది చిప్పా, కర్రా.


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టరు)

తెల్ల వెండ్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మాసువాసనగల "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0, 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O.) P. O. Kaithanwar (el Bagh).


తను రిటైరయినవాడు, జ్ఞాపకార్థం భగవద్గీత, దంతపు పిడిగల చేతికర్రా ఇచ్చారుగాని, ఒకచిప్పా, కర్రా ఇస్తే బాగుండేది.

లేచి ముఖం కడుక్కొని- కాసులమ్మ యిచ్చే కాఫీగ్లాసు అందుకుని- భార్యకేసి అతిపరీక్షగా చూడటం మొదలు పెట్టాడు.

"అదేమిటండీ! అల్లాగ వెర్రిచూపులు చూస్తారేం!" అని తనవళ్ళు ఓసారి చూసుకుంది.

"ఏవమ్మా! బావగారు చాలా ఖాళీగా కూర్చున్నారే? ఎల్లాగయినా అదృష్టవంతులు! దేనికైనా పెట్టిపుట్టాలి" అని ఉపోద్ఘాతం ప్రారంభించాడు, అవధానిమ్మంలో కాలుపెడుతూ. అవధానితోకూడా మరో ఆసామీ వచ్చాడు.

గృహస్థ ధర్మం ప్రకారం ఇద్దరికీ కాఫీ గ్లాసు అందించింది కాసులమ్మగారు. అవధాని నిరుత్సాహంగా అందుకుని "అమృతం!" అని గుటక వేసి-

"బావగారూ! మంచి వార్త చెప్పడానికి వచ్చాను- అమలాపురంలో ......" అని చెపుతుండగా బుచ్చిరామయ్య మాటకడ్డు వచ్చి—. "వద్దండీ! ఇదివరకు కొందామనుకున్నానుగాని, ఇప్పుడు భూమి కొందామని వుద్దేశం లేదు." అన్నాడు.

ఇదివరలో ఓసారి భూమికొందామని వుంచినీ, కోనసీమలో ఏదేనా మంచిది చవగ్గా వచ్చినప్పుడు చెప్పమని అవధాని చెవిని పడవేశాడు. ఇప్పుడు ఆ విషయం గురించి వచ్చాడనీ- ఇప్పుడు డబ్బు సరిపోదు గనుకా- పై విధంగా అనేశాడు:- పైగా ప్రక్కనున్న ఆసామీ భూకామందులా కనబడ్డాడు.

అవధాని ఆరోహణస్థాయిలో నవ్వి "అది కాదు: వీరు రామకృష్ణారావుగారని అమలాపురం వాస్తవ్యులు" అని పరిచయంచేసి, "మంచి సంప్రదాయం కలవారు. ముప్పై ఎకరాల భూమికి అధిపతి. పాడీ పంటా అన్నీ సమృద్ధిగా ఉన్నాయి. వీరికిఒక్కతే కూతురు. గాత్రం నేర్పితే ఊపిరితిత్తులు పాడవుతాయని వీణ నేర్పించారు. చదువు అంటారా! పెద్దచదువు లేకపోయినా గృహకృత్యాలకు లోటుండదు. పిల్ల సాక్షాత్తు సరస్వతి!-ఇల్లాగ ఉండగా నన్ను సంబంధం చూడమని పెద్ద భారం పడవేశారు. అసలు ఇలాంటి వ్యవహారాల్లో చిక్కుకోవడం అంటే - ముఖ్యంగా పెళ్ళి వ్యవహారంలో నాకు ఇష్టం లేదు-అయినప్పటికీ- కావలసిన వాడు గనుక - బాగా ఆలోచించాను. చివరికి నాలుక కరచుకుని మన గోపాలం ఉండగా ఇంత ఆలోచన ఎందుకా అని తీసుకొనివచ్చాను. సరిగ్గా యీడూ జోడూ సరిపోతుంది. ముప్పైఎకరాలకీ, ఇంటికీ అధిపతి అవుతాడు - పిల్లజమీందారులా జరిగిపోతుంది." చాలా నాటకదక్ష్యంగా, చేతులు త్రిప్పుతూ, అభినయం చేస్తూ ముఖకవళికలు మారుస్తూ పాత్రను చాలా చక్కగా నిర్వహించాడు.

బుచ్చిరామయ్య మనస్సులో ఒకదృశ్యం మెరసింది. కోడలు సరస్వతిలా వీణ వాయిస్తుంటే-కొడుకు వింటూ హాయిగా సుఖపడుతుంటే-తనూ భార్యా, బావగారూ దేవాలయానికి వెళ్ళి పురాణశ్రవణం చేస్తుంటే ఆహా నిజంగా స్వర్గం కనిపించింది తనకి. నిజంగా అంత అదృష్టమా? ఆసమయంలో అవధానిని కౌగలించుకుందామా అనిపించింది.

కాసులమ్మ మరోకప్పు అందిస్తూ "మన మీద ఎంత అభిమానమో! పూర్వపు స్నేహితులకి ఇప్పటికీ ఎంత శ్రద్ధా!" అనుకుంది లోపల.

శ్యామల తలుపువెన్కగా ఆనుకుంటూ- ఇదంతా చూస్తోంది. ఇంతలో గోపాలం బుర్రవంచుకొని, క్రిందచూస్తూ ఏదో పుస్తకం పుచ్చుకుని బయటకు పోతూంటే- కాసులమ్మగారు "ఒరేయి! గోపీ" అని కేకేసింది. వెనక్కి తిరిగాడు.

అవధాని కొంచెం లేచి "ఏరోయ్! గోపీ మర్రిపోతూ వేమిటి?"

"ఇంకా నయం: మమ్మల్ని మరచిపోతావా? నీకు ఈమధ్య కనబడటం లేదే."

"లేదోయ్, ఒక పనా? ఒక లోకమా? తెగతిరుగుతున్నాను." గోపాలానికి కొంచం నవ్వవచ్చింది-ఆ నవ్వులో చాలా అర్థం ఇమిడి ఉంది.

అవధానికి ఒక పని అంటూ ఏమీ లేదు. అక్కడా అక్కడా పెళ్ళిళ్ళు జరిపించి, పొలాలూ, ఇళ్లూ క్రయవిక్రయాలు జరిపించి పొట్ట నింపుకుంటాడు. ఎవరికి ఏ వూళ్ళో ఎంత ఆస్తి ఉన్నదీ, పిల్లలు ఎంత మంచి ఉన్నదీ అతనికి తెలిసినట్లు ఎవరికీ తెలియదు అనటంలో అతిశయోక్తి లేదు. అతనికి పెళ్ళామూ, బిడ్డలూ లేరు. గనుక పెళ్ళిళ్ళు జరిపి-నాటిపర్యవసానాలు చూసి ఆనందిస్తూ ఉంటాడు. నిజానికి మంచి బ్రతుకుతెరువు తెలిసిన మనిషి.

"ఏం చేస్తున్నట్లు" ప్రశ్నించాడు అవధాని.

"ప్రస్తుతం ఏమీ లేదు!" గోపాలం జవాబిచ్చాడు.

"అసలు ఏమి చేద్దామనుకుంటున్నావు?"

"చేద్దామనుకున్నది జరిగితే-ఊహాలా అవీ ఉండవుగా?"

"సరేగాని - వీరు అమలాపురం వాస్తవ్యులు రామకృష్ణారావుగారు" అని పరి

యం చెయ్యగానే, గోపాలం నమస్కారం చేశాడు. ప్రతి నమస్కారం చేసి-చూపించిన సభ్యతకు లోపల చాలా మెచ్చుకున్నాడు పిల్లతండ్రి. తన కూతురికి తగినవాడేనని నిర్ధారణ చేసుకున్నాడు.

"వారి అమ్మాయిని నీకు యిద్దామనే ఉద్దేశంతో వచ్చారు. నీ ఉద్దేశం కావాలి?"

"కడుపు పోషించుకోలేనివాడికి అదొక్కటే లోటొచ్చింది?"

"అదేవిటోయ్. ఈయనకి ముప్ఫై ఎకరాల మాగాణీ, కొబ్బరితోట, పాడి అన్నీ ఉన్నాయి. ఒక్క కూతురుతప్ప ఇంకెవరూ లేరు. ఆస్తి అంతా నీకే వస్తుంది ఇంకా సంపాదన చెయ్యవలసిన అవసరం ఏమిటి? పిల జమీందారులా జరిగిపోతుంది!"

"ఒకరి ఆస్తిని అనుభవిద్దామనేటంత దుర్మార్గుణ్ని కాను. ఒకళ్ల డబ్బు నాకోసం వినియోగించుకొని-పిల్లను కన్నందుకు తండ్రికి శిక్ష విధించటం నా అభిమతం కాదు." అని రామకృష్ణారావుగారికేసి చూసి "చాల శ్రమపడి వచ్చారు. ఇప్పట్లో వివాహం చేసుకోవాలనే ఉద్దేశం లేదు." అని సుడిగాలిలా రివ్వున వెళ్లిపోయాడు. "పిల్లని చూస్తే ఇల్లాగ మాట్లాడవు?"అన్న అవధాని మాటలు చెవిని పడ్డాయో లేదో-అప్పటికే మెట్లు దిగిపోయాడు.

"ఒకరి ఆస్తిని అనుభవిద్దామనే దుర్మార్గుణ్ని కాను" అని అనడమే "ఇప్పుడు చేసేపనేమిటో?" అని పైకి అందామనుకున్నాడు బుచ్చిరామయ్య, కాని కొడుకును కన్నాక పోషించడం భారమంటే నవ్వుతారు. అందులో డబ్బుగల పెళ్ళివారి ముందు.

రామకృష్ణారావుని బాగా ఆకర్షించాడు గోపాలం. ఆ రూపురేఖలూ, మాటలోని గాంభీర్యం, ఉత్తమ ఉద్దేశాలూ-ఇవన్నీ అతని మనస్సులో ముద్రించుకుపోయాయి. తన కూతుర్నీ, గోపాలాన్నీ ప్రక్క ప్రక్కన నిలబెట్టి చూసుకున్నాడు మనస్సులో-ఆహా! ఎటువంటి జోడీ! ఎల్లాగయినా ఈ వివాహం చెయ్యాలి అని-"ఎల్లాగయినా ఒప్పుకోవాలి" బుచ్చిరామయ్య చేతులు పట్టుకున్నాడు.

ఆ పరిస్థితిలో బుచ్చిరామయ్యకు-భగవంతుడు ఒక దారిచూపించినట్లయింది. తప్పకుండా! రేపు ఆదివారం పిల్లను చూడటానికి వస్తాం. కుర్రవాడు. వాడిమాటలకేం లెండి!" అని పంపించాడు-వెళ్తూ అవధాని "ఆదివారం దశమి - చాలామంచిది - తప్పకుండా రావాలి" అని వెళ్ళిపోయాడు సగర్వంగా.

కిరాణాకొట్టు విశ్వనాథాన్ని చూడగానే, అనామత్తుబాకీ జ్ఞప్తికి వచ్చింది. "ఏమండీ. మా వ్యాపారం ఏమీ సరిగ్గా నడవటంలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. ఆ బాకీ కాస్త ఇప్పించేయండి. ఇల్లాగ త్రిప్పడం ఏమీ బాగోలే" దని రేపు ఇస్తానని రమ్మనగానే-ఇంక వాయిదా వెయ్యొద్దని ఖచ్చితంగా చెప్పి వెళ్ళాడు.

ఛీ! వెధవడబ్బుకోసం ఏ గడ్డి అయినా కరుస్తాడు. అయిదు తులాల కాఫీ పొడికొంటే అరపౌను అని పద్దు రాస్తాడు? ఇదేమిటి అని వెంటనే అడిగితే పొరపాటు: అంటాడు. లేకపోతే "కొంగపద్దులు-" ఏమన్నా అంటే! అరువులు ఇస్తే-తన డబ్బుకివడ్డీ పెరిగిపోయిందని లెక్కలు చెబుతాడు. అసలు వ్యాపారస్తుల జబ్బే అది. అవసరమంటే-కాళ్లు పట్టుకుని చుట్టూ తిరుగుతారు-లేకపోతే గడ్డిపరకకంటె హీనంగా చూస్తారు. ఏం చేసినా - కూడబెట్టిన డబ్బు కప్పేస్తూ ఉంటుంది.


"నాన్నా! ఈ వేళ పాలవాడు పాలు నీళ్ళలా పోశాడు. ఏం? ఇల్లాగ పోశావు అంటే-కావలిస్తే పుచ్చుకోమనీ, లేకపోతే మానెయ్యమనీ అంటున్నాడు-పాలకి పేర్లు పెటవద్దంటున్నాడు?" అంది శ్యామల.

"అరి పిడుగా! ఏమిటే విప్లవం!" ఇవే మాటలు తను ఉద్యోగంలో ఉన్నప్పుడు అంటే పాలు శాంపిల్ తీయించి-జుర్మానా తగిలిస్తే తెలిసేది వాడి పొగరు. అన్ని విధాలుగానూ పనికిరాని వాడిగా, విలువలేని వాడిగా తయారయ్యాడు - అన్ని బాకీలు తీర్చేసి, ఆ అమలాపురం సంబంధం ఒప్పుకోవటంకంటే వేరే గత్యంతరం లేదని నిర్ణయానికి వచ్చాడు - భోజనం చేసి - చెక్కు మార్చుకుందుకు ట్రెజరీకి వెళ్లాడు.

చెక్కు క్యాష్ చేయించుకొని - డబ్బు లెక్క పెట్టుకుందామని - జనం ఎవరూ లేని చోట - కాంపౌండ్ వాల్ దగ్గర, మర్రిచెట్టు నీడలో లెక్క పెట్టుకున్నాడు. డబ్బు ఒకటికి పదిసార్లు లెక్క పెట్టాడు-కవర్లో పెట్టి పైకి తల ఎత్తేటప్పటికి - గోపాలం-లైబ్రరీకి వెళ్ళడం చూసి-కోపం పట్టలేక "గోపీ!"అని కేకేశాడు. కేకేసి "నీకు యింకా కష్టసుఖాలు తెలియకపోతే ఎల్లాగ-చూశావా - నా జీవితమంతా అయిపోయింది. నువ్వు ఏమీ పట్టనట్లు ఇరవైనాలుగు గంటలూ పుస్తకాలు చదువుతూ కూర్చుంటుంటే ఇక్కడ ఏమన్నా ఖజానాలు నిండి ఉన్నాయనుకున్నావా? జాగ్రత్తగా ఆలోచించు" అని కవరు కోటుజేబులో పెట్టుకొని వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళి - చెప్పులు విప్పి- "ఉష్!" అంటూ కుర్చీలో కూర్చుని కోటు విప్పుకుంటూండగా, కౌసులమ్మ వచ్చి "అదేమి

(56-వ పేజీ చూడండి)



# ★ సంపాదన ★

(25 వ పేజీ తరువాయి)

టండీ మెయిలు వచ్చే వేళయింది - అమ్మాయిని తీసుకురావద్దూ?"

"అయ్యో! నా తెలివి మండా?" అని ఉన్న చెప్పుల్లో కాళ్లు దూర్చి స్టేషనుకి తొందరగా నడక సాగించాడు.

ఆ రోజు మెయిలు సరిగ్గా టయిముకే వచ్చింది. అమ్మాయి దిగింది. ఒక్క అడుగు ముందుకు వెయ్యకుండా బళ్లవాళ్లు చుట్టుముట్టారు. ఒకడు పెట్టె, ఒకడు బెడ్డింగూ పట్టుకెళ్లి రెండూ రెండు బళ్లలోనూ పెట్టుకున్నారు. అవి దింపించేసి అప్పలస్వామి ఒంటెద్దు బండిమీద ఎక్కారు.

బండి మెల్లిగా నడుస్తోంది.

"అల్లాగ చిక్కిపోయావేం తల్లీ?"

"ఏం చెప్పను నాన్నా: అది మహానరకం: ఆయన పాపం: ప్రాణంగా చూసుకుంటారు కాని కుటుంబం పెద్దది-నాకు ఏదేనా కొంటే ఏదో విధంగా దెప్పటం మొదలెడతారు. అటువంటప్పుడు మందులు కూడా ఎక్కడ కొంటారు: ఏ నెలలోనైనా కొస్త మిగిలితే వెధవ అప్పగారికీ, తల్లికీ నైనుతానులు కొనడానికే సరిపోతుంది."

"పెద్దయింటో పడేస్తే సుఖపడతావనుకున్నాను తల్లీ! ఎల్లాగయినా ఆడవాళ్ల బ్రతుకు ఇంతేనమ్మా" అని వచ్చే కంటినీరు తుడుచుకున్నాడు.

"రిటైరయ్యావట కదూ?"

"అవునమ్మా-ఇక మనవణ్ణి ఎత్తుకుని ఆడుకోవచ్చు."

అవీ, ఇవీ మాట్లాడుకుంటూంటే బండి ఇల్లు చేరింది-కౌసులమ్మగారు దిష్టి తీసింది-శ్యామలను అక్కయ్యను యింటోకి తీసుకెళ్లింది. బండివాడికి డబ్బులిచ్చి-కోటు కౌసులమ్మగారి కందిస్తూ-"ఇందులో అయిదు వేల ఆరు వంద లుంటాయి. సరిగ్గా లెఖ్ఖ చూసి జాగ్రత్త పెట్టు" అని కుర్చీలో కూర్చున్నాడు.

కౌసులమ్మగారికి కోటుజేబులో ఏమీ కనబడలేదు. జేబు ఖాళీ—

"డబ్బు ఎక్కడుంది?"

"ఆ జేబులో నే?"

"ఏదీ"

కోటు తీసుకొని-వెతికి "ఆ!" అన్నాడు.

ప్రసిద్ధమైన నంజనగూడు పండ్లపొడి వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ — కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్జక్ — గోరోజన మాత్రలు.. " 0-8-0
బాలక్స్ — విరేచనముగుటకు మాత్రలు.. " 0-6-0
మా మందుల పూర్ణ జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.

అంతే. బుచ్చిరామయ్య నిశ్చేష్టుడయాడు.

"ఏంటి నాన్నా:" కూతుళ్ల గొంతులు కలిసి ప్రశ్నించాయి. శరీరంలో రక్తం ఒక్కసారిగా ప్రవహించటం ఆగినట్లయింది. కాళ్ల క్రింద మట్టి క్రిందికి లోతుకి దిగినట్లయింది- వెంటనే అక్కడనించి పరుగెత్తాడు తను డబ్బు మార్చిన తరువాత తిరిగిన చోట్లకి- డబ్బుపోయింది-నడుస్తున్నాడు. ఖంగారుగా రోడ్డుమీద-బుర్రలో ఆలోచనలు అంతకంటె వేగంగానడుస్తున్నాయి. "తనగతి ఏంకాను? కంట్రాక్టరు నర్సన్నకు ఇల్లు ఇచ్చేయవలసిందేనా. ఎక్కడ ఉంటాడూ-మిగతా బాకీలు ఎల్లాగ తీరుతాయి?—ఒకటా—రెండా. అయిదు వేల ఆరువందల రూపాయలు—కష్టపడి సంపాదించినడబ్బు—అయిదు వేల ఆరు వందల స్వేదబిందువులు-"ఇంతిలో సిటీబస్ దూసుకుపోయింది—వీసం వాసిలో తప్పిపోయింది. లేకపోతే చచ్చిపోయేవాడు. చచ్చిపోయినా బాగానే ఉండును. ఛస్తే-పెళ్ళాం బిడ్డలగతి?— ఫుట్ పాత్ మీద నడవమని పోలీస్ హెచ్చరిక చేశాడు.- అంతా వెతికాడు-ఎక్కడా డబ్బులేదు.

పోనీ తను చచ్చినా-కొడుకు ప్రయోజకుడవుతాడు-ఇక చావడంకంటే గత్యంతరం కనిపించలేదు. వెళ్ళి రైలుపట్టాలమీద నడవడం మొదలెట్టాడు.

రైలు—ఇంజను హోరెత్తుతూ—వస్తోంది. ఇక ఫర్లాంగుదూరంలో వుందనగానే- గేదె ఒకటి అడ్డంగా పరుగెత్తి చక్రాల క్రింద పలగడం, రైలు ఆగడం-జనం అంతా చూడటం జరిగాయి. బుచ్చిరామయ్య కూడా చూశాడు. స్వరూపం లేకుండా మొండెం, తలా అటు ఇటూ పడిపోయాయి-రక్తం చిమ్మింది. కాళ్లు గిల, గిలా కొట్టుకుంటోంది. ఆ దృశ్యం చూస్తే భయం వేసింది.

"ఛీ! తను యిల్లాంటి చావా కోరుకుంటు: నాకు ఈ చావువద్దు:" అని ఇంటికి మరలి వచ్చాడు—.

గోపాలం యింటికి వచ్చేసరికి-యిల్లంతా గోలగా వుంది-చుట్టుప్రక్కల జనం అంతా పోగయ్యారు. సాయంత్రం బాకీకి వచ్చిన నర్సన్న సంతోషంగానే ఉన్నాడు-రెండు వేల పెట్టుబడికి పదివేల యిల్లు వస్తూంటే సంతోషంకాదూ-ఇది తెలుసుకున్న విశ్వనాథం పంచె ఎగకట్టుకుంటూ పరుగెత్తుకుంటూవచ్చి-"బాకీ ఎగవెయ్యటానికి-పద్ధతులు" అని అన్నాడు.-"ఇదేమిటి? ఏమి జరిగింది"? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"ఇంకేముంది నాయనా? అయిదు వేల ఆరువందలూ పోయాయి:" అంది కౌసులమ్మ దీర్ఘాలుతీస్తూ.

"ఇదిగో నాన్నా డబ్బు:" అని గోపాలం కవరిచ్చాడు.

"ఆఁ!" అది తనదే, తీసి చూశాడు అయిదు వేల ఆరువందలు. వెంటనే గోపాలాన్ని కౌగలించుకొని-"ఎక్కడ ఉంది?" అని అడిగాడు.

"ఇందాకా! నేను లైబ్రరీకి వెళ్తూంటే నన్ను కేకేశావు. అప్పుడు జేబులో పెట్టుకుంటూ, కవరు క్రింద పడేశావు. అదిచూసి-ఏవో కాగితాలు కాబోలు ఇంటికి వెళ్లాక యివ్వవచ్చుని అప్పుడు వెనక్కి పిలవలేను. తీరా చూద్దునుగదా డబ్బు!"

"నీ తరువాత వారసుడు కదూ! వాడికే దక్కింది, అది న్యాయమే?"అందిశ్యామల.

ఇంతలో పోస్ట్‌మేన్ వచ్చాడు - ఓ రిజిష్టరు కవరూ, ఒక కవరు ఇచ్చాడు. విప్పి చూసి - గెంతు గెంతాడు - "శ్యామలా! చూడు" అన్నాడు.

"ఆలిండియా రేడియోలో తన నాటకం ప్రసారంచేస్తున్నట్లు రిజిష్టర్ కవరులోనూ, తన స్నేహితురాలు తండ్రిచే నడపబడుతున్న "ఆంధ్ర - సంపద" అనే పత్రికకు సహాయ సంపాదకునిగా ఉండమని కోరుతు రెండవ కవరూ వచ్చింది. జీతం రెండువందల రూపాయలు."

"గోపాలం అందరికంటే ప్రయోజకుడు. నేను యిదివరకే అనుకున్నాను" అంది కౌసులమ్మ.

"డబ్బుతోపాటు, పేరు ప్రతిష్టలుకూడా సంపాదిస్తాడు గోపాలం!"

"గోపాలం కాదు" — "సిరి" అంది శ్యామల.

"అదేమిటి?" తల్లీ, తండ్రీ, అక్క ప్రశ్నించారు.

"అది అన్నయ్య కలం పేరు నాన్నా" అంది శ్యామల.

"ఇద్దరూ తోడుగొంగలు - అందుకే కాబోలు - ఇద్దరూ పుస్తకాలు పడేసుకుని కూర్చుంటారు."

"ఏమోనమ్మా - నాకిదంతా అయోమయంగా ఉంది" పొరుగింటి రేడియోలో "కలయో - వైష్ణవమాయయో?" అని భాగవతారుగారి హరికథాప్రసారం జరుగుతోంది.

"హుఁ!! సంపాదనను గౌరవించే మనుష్యులు, ఆనందం వచ్చినా పటలేరు: విచారం వచ్చినా సహించలేరు ఏమి మనుష్యులు? ఏమి "లోకం" అనుకున్నాడు— గోపాలం, కాదు "ఆంధ్ర - సంపద" సంపాదకుడు "సిరి." ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press. 6 & 7, Thambu Chetty Street. Madras-1. Editor S. Sambhu Prasad.